టీడీపీ ఆత్మీయ సమావేశం గందరగోళం

- చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకలకు అలస్యంగా వచ్చిన పవన్ కళ్యాణ్
- నిరాశతో తిరిగి వెళ్లిపోయిన తెలుగు తమ్ముళ్లు
- 15 నిమిషాలు పనిచేయని మైకు

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : చంద్రబాబు నాయుడు 74వ జన్మదిన వేడుకలు, అదేవిధంగా నియోజవర్గ టీడీపీ నాయకులతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు కొత్తపల్లి మండలం కొత్తపల్లి సురక్ష ప్యాలస్‌లో శనివారం ఆత్మీయ సమావేశానికి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ విచ్చేశారు. అయితే సమావేశానికి పవన్ కళ్యాణ్ రెండు గంటలు ఆలస్యంగా రావడంతో చాలామంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరాశతో వెనిదిరిగారు. 12 గంటలకు సమావేశం ప్రారంభం అవ్వాల్సి ఉంది. 2 గంటల 15 నిమిషాలకు పవన్ కళ్యాణ్ రావడంతో, ఒక్క సారిగా అభిమానులు, టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా మీదకు రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. పవన్ కళ్యాణ్ చెప్పే మాటలు ఎవరికీ వినబడక నాయకులు నిరుత్సాహపడ్డారు. పవన్ కళ్యాణ్ తొలిత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి, చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేసి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు అందజేశారు. అలాగే మత్స్యకారులు పలు సమస్యలను పవన్ దృష్టికి తీసుకువచ్చారు. టీడీపీ ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను పవన్ కళ్యాణ్‌కు వర్మ పరిచయం చేశారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, పిఠాపురం నియోజకవర్గం ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. మాట్లాడుతున్న సమయంలో 15 నిమిషాలు మైకు పని మైకు పనిచేయకపో వడం, గందరగోళంగా ఉండడంతో అర్ధాంతరంగా సమావేశాన్ని ముగించుకుని పవన్ కళ్యాణ్ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జనసేన పార్టీ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు), మండల టిడిపి అధ్యక్షుడు అని శెట్టి సత్యానంద రెడ్డి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, చోడిపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో ఉమ్మడి అభ్యర్థి గిడ్డి ప్రచారం

విశాలాంధ్ర - మామిడ కుదురు : లంక గ్రామాలైన బి దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో పి గన్నవరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్య నారాయణ టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. పెదపట్నం లంక సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్ ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వేంటనే ఇరిగేషన్ కాలువ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. డ్రైనేజీ సదుపాయం, త్రాగు నీరు, నదీ కోత నివారణకు గ్రోయన్లు ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. తనతో పాటు ఎంపి అభ్యర్థి హరీష్ మాధుర్‌లను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జనసేన మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాసా రాజా, విళ్ళ సుబ్బారావు, తాతకాపు, బోణం బాబు, నల్లా పవన్, నల్లా అజయ్, కుంపట్ల నాయుడు, లాల్‌బాబు, డొక్కా నాద్ బాబు పాల్గొన్నారు.

రేపు వైసీపీ అభ్యర్థి భరత్ నామినేషన్

విశాలాంధ్ర - రాజమండ్రి: రాజమండ్రి నగర వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మార్గాని భరత్ రామ్ ఈ నెల 22వ తేదీ నామి నేషన్ వేయనున్నారు. నగరం లోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ఎంపీ వెల్లడించారు. వైసీపీ బీ ఫారంతో సహా నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించనున్నట్టు తెలిపారు. నగరంలోని అన్ని వార్డుల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆశీర్వదించాల్సిందిగా ఎంపీ కోరారు. ఎంపీగా రాజమండ్రి నగరానికి చేసిన అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమేనని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగర రూపురేఖలు పూర్తిగా మార్చివేస్తానని చెప్పారు. త్వరలోనే నేను ఎమ్మెల్యే అయ్యాక చేయబోయే అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు

ఎన్నికల ప్రచారంలో ఆదిరెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర - రాజ మహేంద్రవరం : సంపద సృష్టించడం చేతకాని... రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇక రాష్ట్రానికి అవసరం లేదని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ , జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 13వ డివిజన్ డెక్‌మాండ్ పార్కు ప్రాంతంలో అంగన్ వాడీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి కప్పల వెలుగు కుమారి, డివిజన్ కమిటీ ప్రెసిడెంట్ నగరబోయిన రామకృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొర్రా చిన్ని, ఉపాధ్యక్షులు రాయి అప్పన్నబాబు, స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, కమలం గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అందినకాడికి అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని మండిపడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తాను 50 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తానన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దేవ నామినేషన్

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న దేవ వరప్రసాద్ శనివారం రాజోలులో నామినేషన్ దాఖలు చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభి మానుల మధ్య భారీ జన సందోహంతో మలికిపురం, లక్కవరం, శివకోటి మీదుగా రాజోలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎమ్మెల్యే మనేపల్లి అయ్యాజీ వేమా, రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్ దేవ వరప్రసాద్ నామినేషన్ పత్రాలు పూర్తి చేసి పూర్తిగా పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

స్వతంత్ర అభ్యర్థి ఆనంద్ నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర - రాజా నగరం : మే నెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకి సంబంధించి నామ నేషన్ల స్వీకరణ కార్యక్రమాలు పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ మూడోరోజు శనివారం కొనసాగాయి. రాజానగరం అసెంబ్లి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా బర్రె ఆనంద్ కుమార్ శనివారం నామినేషన్ వేశారు. తొలుత నామినేషన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి ఐదుగురు సభ్యులతో ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి(ఆర్వో) చైత్ర వర్షిణికి అందజేశారు. పత్రాలను పరిశీలించిన ఆర్వో నామినేషన్ పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

- జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలి
- తమకు కేటాయించిన రూట్‌లో పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా మూడుసార్లు పరిశీలించాలి
- కలెక్టర్ జె నివాస్

విశాలాంధ్ర - కాకినాడ : పోలింగ్ ప్రక్రియ అంతటిలో సెక్టోరియల్ అధికారుల విధులు అత్యంత ముఖ్యమని, విధి నిర్వహణలో బాధ్యతతో వ్యవహరించి జిల్లాలో పోలింగ్ సజావుగా సాగేందుకు సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె నివాస్ అన్నారు. కాకినాడ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సెక్టోరియల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె నివాస్, ట్రెయిని కలెక్టర్ హెచ్‌ఎస్ భావనతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై సెక్టోరియల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పోలింగ్ రోజున సెక్టోరియల్ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించడం, ఈవీఎం, వీవీపాట్స్ పనితీరు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్స్ సెక్టోరియల్ అధికారుల విధులు తదితర అంశాలపై కలెక్టర్ నివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులకు తమకు కేటాయించిన రూట్‌లో తప్పనిసరిగా మూడుసార్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. గత 2019 సాధారణ ఎన్నికల్లో దొర్లిన పొరపాట్లను దృష్టిలో ఉంచుకుని 2024 సాధారణ ఎన్నికల్లో సిబ్బంది శిక్షణ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ ప్రక్రియ, ఈవీఎంల పనితీరుపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి సెక్టోరియల్ అధికారికి పది నుంచి పన్నెండు పోలింగ్ కేంద్రాలు ఉంటాయని ఈ పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన సమయానికి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యేవిధంగా సెక్టోరియల్ అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో, పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ సెంటర్ల వద్ద పోలింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పని చేయలన్నారు. ఏ పోలింగ్ కేంద్రంలోనైనా ఈవీఎం, వీవీప్యాట్స్‌లలో టెక్నికల్‌గా సమస్యలు తలత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పడకుండా టాయిలెట్స్, విద్యుత్, తాగు నీరు, ఫర్నిచర్ వంటి సదుపాయాలు అదేవిధంగా చూసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో సెక్టోరియల్ అధికారులు నూరు శాతం నిమగ్నమై ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు కృషి చేయాలని కలెక్టర్ జె నివాస్ అధికారులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కె భారతి సౌజన్య, ఇతర మాస్టర్ ట్రైనీస్ పాల్గొన్నారు.

ఉద్యమాన్ని అణచివేసిన బాబుతో పవన్ జత కడతారా

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : కాపు ఉద్యమాన్ని అణిచివేసిన చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ జత కడతారా అంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం మండిపడ్డారు. ప్రత్తిపాడు నియోజకవర్గం లంపకలోవ, పోతులూరు, శరభవరం, గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు ముద్రగడ అనుచరులు కిర్లంపూడి ఆయన నివాసంలో శనివారం కలిసి మద్దతు తెలియజేశారు. ఆ గ్రామాల నుండి వచ్చిన వైసీపీ నేతలతో ముద్రగడ మాట్లాడుతూ ఆనాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాపు ఉద్యమాన్ని అణచివేశారని, అందువల్ల పవన్ చంద్రబాబుతో పవన్ జత కడతారా అని అన్నారు. పేదల ముఖ్యమంత్రి జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌తోనే ఆంధ్రాకు ప్రత్యేక హోదా

విశాలాంధ్ర - ఏలేశ్వరం : కాంగ్రెస్ పార్టీతోనే ఆంధ్రకు ప్రత్యేక హోదా వస్తుందని ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీరు కొండ సత్యనారాయణ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో ఆయన ముమ్మర ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విభజన హామీలు అమలు చేస్తామని అన్నారు. అనంతరం తిరుమాలి గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్య ప్రకాష్‌రావు, శ్రీను, కార్యకర్తలు ఉన్నారు.

భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా దుగ్గిరాల శ్రీదేవి నామినేషన్

విశాలాంధ్ర - రాజమహేంద్ర వరం: తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం రూరల్ భారత చైతన్య యువజన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దుగ్గిరాల శ్రీదేవి శనివారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజమండ్రిలో ఉన్న ప్రతి సమస్య నాకు అవగాహన ఉందని ఈ సమస్యకు పరిష్కారాలు కోసం పాటుపడతానని తెలిపారు. వ్యవసాయం, ఉద్యోగులకు, మహిళలకు యువతకు, అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమానికి మహిళలు, భారత చైతన్య యువజన పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు

మరింత అభివృద్ధి చేయడానికి అవకాశమివ్వండి

విశాలాంధ్ర - సీతానగరం: మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఇవ్వండి అని జక్కంపూడి గణేష్ సతీమణి జక్కంపూడి సుకీర్తి అన్నారు. మండలంలోని రఘుదేవపురం గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ పేటలో శనివారం జక్కంపూడి సుకీర్తి ఇంటింటికి పాదయాత్ర చేస్తూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుకీర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి మరింత అభివృద్ధి జరగడానికి మరొకమారు వైసీపీ అభ్యర్థి జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, గెద్దాడ త్రిమూర్తులు, జక్కంపూడి జగపతి, సుంకర సూర్య చంద్రం, పిండి రాధ కృష్ణ పాల్గొన్నారు.

ఆదిలక్ష్మికి అడుగడుగునా ఆదరణ

విశాలాంధ్ర - అనపర్తి : పేదవారి జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక ధరణికోటలో గడపగడపకు వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి కృషిచేసిన ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డికి మరోసారి ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆదిలక్ష్మికి అడుగడుగునా మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్), ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

కమిషనర్ వెంకట్రావు

విశాలాంధ్ర - కాకినాడ : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకుని ప్రజాస్వామ్యంలో మంచి పరిపాలనను అం దించే పార్టీ వ్యక్తులను గెలిపించుకోవాలని కాకినాడ నగర కమిషనర్ వెంకట్రావు పేర్కొన్నారు. కాకినాడ కల్పన సెంటర్లోని ఎస్ఎంఎస్ రోటరీ హాల్లో రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ సమావేశం శనివారం జరిగింది. రోటరీ క్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని ఓటు హక్కును గురించి వివరించారు. ఈసందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలు అంత స్వేచ్ఛ యుత వాతవరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీలు చందు, పాస్ట్ ప్రెసిడెంట్ డా రామకృష్ణ, సభ్యులు కర్రి అచ్యుతరామారెడ్డి, నల్లమిల్లి మాచారెడ్డి, బుపేంద్ర, నేతి నాగేశ్వరరావు బదిరెడ్డి వెంకన్న, కాశీవిశ్వనాద్, కేబుల్ బాబీ పాల్గొన్నారు.

రామచంద్రమూర్తిని వెంటనే మార్చాలి

విశాలాంధ్ర - మామిడి కుదురు : ప్రస్తుతం పి గన్నవరం నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఉన్న రామ చంద్రమూర్తి రాయుడు స్థానంలో వేరే వారిని నియమించాలని టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థి గిడ్డి సత్య నారాయణరావు అన్నారు. జిల్లా పరిషత్ డిపార్ట్మెంట్‌లోసీఈఓగా ఉండి ప్రస్తుత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పి చైర్మన్, పి గన్నవరం నియోజకవర్గం వైయస్సార్సీపీ అభ్యర్థి విప్పర్తి వేణు గోపాల రావుతో కలిసి పని చేసిన ఆయనను ఇక్కడ రిటర్నింగ్ ఆఫీసర్‌గా ఎలా నియమిస్తారంటూ ప్రశ్నించారు. ఇదే విషయమై ఏప్రిల్ 8వ తారీఖున ఎలక్షన్ కమిషన్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. మామిడికుదురు మండలం పెదపట్నం లంక గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ నామన రాంబాబు, మామిడికుదురు మండల టీడీపీ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షులు జాలెం శ్రీనివాస రాజా, పెదపట్నం లంక సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్ (చిన్ని), పి గన్నవరం నియోజకవర్గం సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షుడు తాతకాపు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి నామవానిపాలెం సర్పంచ్

విశాలాంధ్ర - కాజులూరు : రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండల పరిధిలోని నామవాని పాలెం గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకట సూర్యనారాణరాజు, ఆయన అనుచరులతో వైసీపీ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, కొప్పిశెట్టితాతాల సమక్షంలో రామచంద్రపురం నియోజకవర్గం ఉమ్మడి టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పార్టీ కండువాలు వేసి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అలాగా మండల వైసీపీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్ర వరప్రసాద్ టీడీపీలో చేరారు. సుభాష్ కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరినవారిలో మాజీ సర్పంచ్ భూపతి సూర్య అర్జునరాజు, భూపతిరాజు వెంకట సుబ్బరాజు, సాంబరాజు, కాకర్లపూడి రామరాజు, శంకరావు, గోపాలకృష్ణ రాజు, జంపన సుబ్బరాజు, మేడిశెట్టి లోవరాజు, తాతపూడి విజయ్ కుమార్, యాళ్ల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

రగ్బీ పోటీలకు పంపినేటి పాపారావు స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర - కరప : అఖిలభారత రగ్బీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున కరప మండలం గురజానపల్లి పంపినేటి పాపారావు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదువుతున్న జ్యోతి చంద్రిక, సునంద తేజశ్రీ, ఈనెల 27 నుండి 28 వరకు మహారాష్ట్ర ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరుగుతున్న 67వ అఖిలభారత రఘువీ పోటలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణమూర్తి, స్టాఫ్ సెక్రటరీ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోకాకు నిక్షయ్ మిత్ర పురస్కారం

విశాలాంధ్ర - అమలాపురం : ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ టీబితో బాధపడుతున్న వ్యక్తులకు "ప్రధానమంత్రి ముక్త్ భారత్ అభియాన్" కింద నిక్షయ్ మిత్రగా టీబిని భారత్ నుండి తరిమికొట్టే కార్యక్రమంలో టీబి వ్యక్తులకు రోజు దగ్గర ఉండి మందులు ఇవ్వడం, మానసిక స్థైర్యం వారిలో నింపడం వంటి స్వయం సహాయక పనులు మోకా వెంకట సుబ్బారావు చేశారు. "ఆరోగ్య మరియు కుటుంబ మంత్రిత్వ శాఖ" భారత ప్రభుత్వం, ఢిల్లీ నుంచి స్థానిక మెడికల్ డీలర్ బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావుకి ప్రశంసా పత్రం అందింది. ఇటువంటి మానవతా కార్యక్రమంలో పాల్గొంటూ సేవలు అందిస్తున్న మోకా వెంకట సుబ్బారావును అమలాపురంలో పట్టణ ప్రముఖులు అభినందించారు.

పార్టీకి విరాళంగా రూ.50,000 చెక్కు అందజేత

విశాలాంధ్ర - అమ లాపురం : రాష్ట్రంలో అరాచక పాలన పోయి ఉమ్మడి కూటమి నేతృత్వంలో సుపరి పాలన స్థాపనకు అందరి సహకారం అవసరమని జనసేన పార్టీకి చెందిన ఎన్ఆర్ఐ మంచెం మనోహర్ అన్నారు. అమలాపురం నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి అయితా బత్తుల ఆనందరావుకు తోడ్పాటు నివ్వడం ద్వారా మరింత ముందుకు వెళ్లగలరని ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. పార్టీ విరాళంగా ఆయన తండ్రి మంచెం బాలకృష్ణ పేరుమీద రూ.50,000 చెక్కును ఆనంద రావుకు అందజేశారు. ఈసందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ వైసీపీ అభ్యర్థులకు దొడ్డిదారిన ఆర్థికంగా బలాన్ని ఇస్తూ ఈసారి ఎలాగైనా గెలవాలని కుటిల యత్నాలు వైసీపీ పాలకులు చేస్తున్నారని మండి పడ్డారు. జగన్ అరాచక పాలనపై విసుగెత్తిన ప్రజలు స్వచ్ఛందంగా ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మనోహర్ లాంటి వారు పార్టీ విరాళం అందివ్వడం ద్వారా ఉమ్మడి ఊటమి ప్రభుత్వ సిద్ధాంతాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వినియోగిస్తామన్నారు. ఎన్ఆర్ఐ మంచెం మనోహర్‌కు ఆనందరావు కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

"పీసీబీ డిజైనింగ్" వర్క్‌షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం వారు 19, 20 తేదీలలో "పీసీబీ డిజైనింగ్" వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఐఐటి వారణాసి నుంచి మొహ మ్మద్ సయ్యద్ అసదుర్ రెహ్మాన్ రిసోర్స్ పర్సన్‌గా విచ్చేశారు. పీసీబీ పై అవగాహన, బ్రెడ్‌బోర్డ్ ద్వారా సర్క్యూట్‌ల అమరిక, సాఫ్ట్‌వేర్ ద్వారా పీసీబీలో సర్క్యూట్ ప్రింటింగ్, సర్క్యూట్ ప్రకారం డ్రిల్లింగ్ చేయడం వంటి మెళకువలు నేర్పబడ్డాయి. ఎంపికైన 100 మంది విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరై హార్డ్‌వేర్ ప్రాక్టీస్‌తో లబ్ధి పొందారు. వర్క్‌షాప్ విస్తృత శ్రేణి ప్రాథమిక ఎలక్ట్రానిక్స్ మరియు దాని హార్డ్‌వేర్ డిజైన్‌తో అధ్యాపకుల మార్గదర్శకత్వంతో ఘనంగా నిర్వహించబడింది. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన కళాశాల చైర్మన్ డా పి కృష్ణారావు, ప్రిన్సిపాల్ డా కె సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు సరైన ప్రాథమిక పరిజ్ఞానంతో ముందుకు సాగేలా ప్రోత్సహించారు. కొత్త విషయాలను రూపొందించడంలో విద్యార్థుల వినూత్న ఆలోచనలకు తమ మద్దతు ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హరనాధ బాబు, వైస్ ప్రెసిడెంట్ సతీష్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ విచ్చేశారు.

చెక్ పోస్టును తనిఖీ చేసిన ఎన్నికల వ్యయ పరిశీలకుడు

విశాలాంధ్ర - జగ్గంపేట : స్వారత్రిక ఎన్నికలకు ప్రత్యే కంగా నియమించిన ఎన్నికల ఖర్చుల అబ్జర్వర్ ఆసిఫ్ శనివారం జగ్గంపేట చేరుకున్నారు. అయనకు నియోజకవర్గ రిట ర్నింగ్ అధికారి ఎం శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఎస్‌టి టీమ్ ఏర్పాటు చేసిన చెక్ పోస్టు తనిఖీలను ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో లైజన్ ఆఫీసర్ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర - కాకినాడ, తాళ్ళరేవు : తాళ్ళరేవు మండలం పటవల పంచాయతీకి చెందిన శెట్టి బలిజి సామాజిక వర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దంగేటి అన్వేష్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో సుమారు 50 కుటుంబాలు బుచ్చిబాబుకి మద్దతుగా టిడిపిలోకి చేరారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. చంద్రన్న సీఎంగా రావాలని మనందరం సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా గంటి హరీష్ మాధుర్ను, శాసన సభ్యునిగా బుచ్చిబాబులను నెగ్గించుకోవాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, గుత్తుల సాయి మరియు పటాల గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం పొడగట్ల పల్లి గ్రామం తెలుగుదేశం పార్టీలో భారీగా చేరికలతో పసుపుమయంగా మారింది. పొడగట్లపల్లి గ్రామం వైసీపీ పార్టీ నుండి పంచాయితీ వార్డు మెంబర్ పట్టా సత్యానందం, కొల్లపు మంగన్న, గోకవరపు సాంబ శివుడు, పులగం శ్రీను, గాది సత్యనారాయణ, పులవర్తి సత్తిబాబు, జవ్వాది త్రినాధులు, దాసిరెడ్డి నాగేశ్వరరావు మరియు సుమారు 150 కుటుంబాలకు చెందిన సుమారు 350 మంది వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి కొత్తపేట నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం మండల పొడగట్లపల్లి గ్రామ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఆరికరేవులలో ఇంటింటికి తెలుగుదేశం

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్: కొవ్వూరు నియోజక వర్గం కొవ్వూరు మండలం అరికరేవుల గ్రామంలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తూ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, కమలం గుర్తుపై ఓట్లు వేసి ఎంపీగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సత్యలక్ష్మి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పిల్లి సత్యలక్ష్మి చిన్నిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసి, శుక్రవారం కర్నూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి చేతుల మీదుగా బీఫారం అందు కున్నారు. మీరు ఈ నెల 24వ తేదీన నామినేషన్ వేసేం దుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లుగా, నాయకులుగా ఉంటూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కాకినాడ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఎంఎం పల్లం రాజు సహకారంతో అసెంబ్లీ అభ్యర్థిగా సీటు సొంతం చేసుకుని ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు సత్యలక్ష్మి తెలియజేశారు. 24వ తేదీన భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తల నడుమ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా యొక్క దస్తావేజులు ది. 16-04-2024న జిరాక్స్‌లు తీయించుటకు పెద్దేవం నుండి తాళ్ళపూడి వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినవి. దస్తావేజు నెంబర్లు 1246/1996, 178/1998 అయి ఉన్నవి. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

కవల కృష్ణవేణి, భర్త వీరవెంకటరావు
పెద్దేవం, తాళ్ళపూడి మండలం, తూ॥గో॥ జిల్లా
సెల్ : 63017 67770

ప్రకటన

యల్లమిల్లి సత్యనారాయణమ్మ, గోపవరం

డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, గోపవరం గ్రామం, యల్లమిల్లి సూర్యనారాయణ కుమారుడు యల్లమిల్లి వెంకటేశ్వరరావు వ్రాయించి ఇచ్చిన ప్రకటన. నా తల్లిగారైన యల్లమిల్లి సత్యనారాయణమ్మ గారు ది. 24-11-2008న మా ఇంటి దగ్గర మరణించారు. వీరి మరణం నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 10 రోజులలో తెలియజేయగలరు.

యల్లమిల్లి వెంకటేశ్వరరావు
గోపవరం, ఉప్పలగుప్తం మండలం
సెల్ : 9441602026

జనసేన నుండి వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు ప్రతి కుటుంబానికి అందించిన పథకాలు చూసి జనసేన పార్టీ నుండి వైయస్సార్‌సీపీలో చేరారని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. శనివారం నిడమర్రు మండలం, గుణపర్రు గ్రామం నుంచి జనసేన పార్టీ కి సంబంధించి యువకులు జగనన్న సంక్షేమ పథకాలు అభివృద్ధికి ఆకర్షితులై 25 మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాసుబాబు సమక్షంలో పార్టీ కండువా వేసి ఆహ్వానించడం జరిగింది.వైయస్సార్‌లో జాయిన్ అయిన వారు కాకులపాటి సుభాష్, కాకులపాటి శ్రీకాంత్, పడమటి శివ ఆంజనేయులు, కాకులపాటి కిషోర్, పట్టపు శ్రీకాంత్, పసుపులేటి స్వరూప్, పసుపులేటి శ్రీనివాస్, గుండుబోగులు గణేష్, పట్టపు నాగు తదితరులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

అధికారంలోకి రాగానే చాకలి ఐలమ్మ విగ్రహం

విశాలాంధ్ర - కైకలూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మనం అధికారంలోకి రాగానే కైకలూరులో చాకలి ఐలమ్మ విగ్రహం పెడతాను అని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు నియోజకవర్గ రజకుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా కైకలూరు నియోజకవర్గం అసంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మరో మాజీ ఎంఎల్ఏ దార సాంబయ్య పాలుగోన్నారు. ఈ సందర్భంగా కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రజక సోదర, సోదరమణిలుకు పేరు పేరునా నా కృతజ్ఞతలు తెలిపారు. ఏ శుభకర్యం జరిగినా రజకులు లేకుండా జరగదని, రజకుల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని కైకలూరు నియోజకవర్గ స్థాయిలో కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తానని తెలిపారు. దేవాలయాలలో ప్రభుత్వం హాస్పటల్‌లో మీకు ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. కైకలూరు మండలం వింజరం వైఎస్సార్సీపీ సర్పంచ్ ధర్మరాజుల నాగమ్మ, ధర్మరాజుల సూర్య నారాయణ మాట్లాడుతూ రజకులే వాలంటీర్‌గా ఉండి మనం ప్రతి ఇంటికి తిరిగి ప్రస్తుత ఎంఎల్ఏ చేసిన అరాచకాలను అందరికి తెలియజేసి రానున్న ఎన్నికలలో డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను గెలిపించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలోని నియోజకవర్గంలోని రజక సోదరులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రిపబ్లిక్ ఆన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) అభ్యర్థిగా రాజు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ పర్వం మూడవరోజు శనివారం జరిగింది. తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా మరపట్ల రాజు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) తరపున ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారని తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.చెన్నయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు మానవతా సహాయం

విశాలాంధ్ర - పెంటపాడు : పెంటపాడు మండలం మానవతా వారిచే పెంటపాడు సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ఆరు ఫ్యాన్లు, ఆరు ట్యూబ్ లైట్లు పెంటపాడు, పరిమెళ్ళ,తాడేపల్లి గూడెం హాస్టల్ విద్యార్థుల సౌకర్యార్థం వితరణ చేశారు. మానవతా జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన రావు , పెంటపాడు ఎంఈఓ టి.వి. రామకృష్ణ చేతుల మీదుగా అందజేసారు. మోహనరావు మాట్లాడుతూ ప్రతీవిద్యార్థి ఇష్టపడుతూ ,కష్టపడి చదవాలని, చిన్ననాటినుండి ఒక ప్రణాళికా బద్ధంగా దీక్ష, పట్టుదలతో చదువే ఒక తపస్సుగా భావించి చదివితే సాధించలేనిదంటూలేదని అన్నారు. ఎంఈఓ రామకృష్ణ మాట్లాడుతూ చదువు వుంటే అన్ని సదుపాయాలు మీ పాదాక్రాంతమవుతాయని, విద్య ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మానవతా మండల ప్రెసిడెంట్ నల్లమిల్లి ప్రభాకర రెడ్డి , హాస్టల్ వార్డెన్స్ సత్తారు రాము, రామలింగేశ్వరరావు, ప్రసాద్ , మానవత కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. విద్యార్థులకు రాత పుస్తకాలు పెన్నులు, బిస్కెట్లు చాక్ లెట్స్ పంపిణీ చేసారు. విద్యార్థుల సౌకర్యార్థం 12 వేల విలువైన సామాగ్రిని అందజేసిన మానవతా వారి సేవలకు హాస్టల్ వార్డెన్లు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. సాంబశివరావు,పి.బి.శ్రీనివాసచార్య,నక్కా సాంబశివరావు, బుద్ధారపు పుల్లయ్య, హాస్టల్ వార్డెన్ జి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి

విశాలాంధ్ర పాలకోడేరు: పాలకోడేరు మండలంలోని విస్సా కోడేరు గ్రామపంచాయతీ పరిధిలోని వంకాయల పాలెం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు పనులు చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో 11 మంది కూలీలు దాడిలోగాయపడ్డారు. పనులు చేస్తున్న కూలీల వైపు ఆకస్మికంగా తేనెటీగలు రావడంతో కూలీలంతా తలోవైపు పరుగులు పెట్టారు. తేనెటీగలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఆ ప్రాంతమంతా కూలీల అరుపులతో దద్దరిల్లిపోయింది. వెంటనే స్పందించిన ఫీల్డ్ అసిస్టెంట్ స్థానికులు 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించగా,సమాచారం అందుకున్న వీరవాసరం 108 అత్యవసర వాహన సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ ప్రశాంతి, పైలట్ వెంకట్రావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవ నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

విశాలాంధ్ర-ఏలూరు: టీడీపీతోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని తేదేపా రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు 75వ జన్మదిన వేడుక దాసరి ఆంజనేయులు క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం పాస్టర్ యోబుతో ప్రార్థనలు చేయించారు. అనంతరం శాస్త్రి కాలనీలో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. 5వ డివిజన్ లంబాడి పేటలో ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటేసి ముఖ్యమంత్రిని చేయాలని రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ని అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ యువతకు భవిష్యత్తు కావాలన్నా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా అమరావతి, పోలవరం పూర్తి కావాలన్నా రాష్ట్రం పురోగతి పొందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా వాణిజ్య విభాగం నాయకులు పరసా రాంబాబు, కంపా విటల్, మాఊరి గంగాధర్ రావు, ప్రసాద్, నల్లమాటి వెంకటలక్ష్మి, పరస ప్రసాద్, రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మానవత

విశాలాంధ్ర-ఆచంట: ఆచంట మండల మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ కాబడిన తూర్పు పాలెం ఆనందపేటకు చెందిన సి.హెచ్.అనిత అనే మహిళ కు, బిడ్డకు బేబి కిట్, పండ్లు, ఔషధాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ నెక్కంటి శివన్నారాయణ, ఆచంట మండల శాఖ ఆత్మీయ సహకార కమిటీ మెంబర్ మయూరి శర్మ , ఆచంట మండలం మానవతా కార్యదర్శి బొక్కా రామకృష్ణ , ఆచంట మండల మానవతా ఈసి. ఎడ్యుకేషన్ మెంబర్ తమ్మినీడి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - కామవరపుకోట : తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం న్యాయం చేస్తారని ఏలూరు తెలుగుదేశం పార్లమెంటు అభ్యర్థి పుట్ట మహేష్ అన్నారు. శనివారం కామవరపుకోటలో మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ సోదరుడు గంట సత్యంబాబు 200 కుటుంబాలతో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్రాన్ని దోచుకోవడానికే జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని , జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపించడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ, కోనేరు వెంకట సుబ్బారావు, గంట సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసకర పాలనకు చరమగీతం పాడాలి

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా సాగుతున్న విధ్వంసకర అరాచక పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు విముక్త ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చాలని బిజెపి రాష్ట్ర అధికార ముఖ్య ప్రతినిధి లంక దినకర్ పిలుపునిచ్చారు. భీమవరంలో బిజెపి నర్సాపురం పార్లమెంటు ఎన్నికల కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో లంక దినకర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ట్రబుల్ ఇంజన్ సర్కారు నడుస్తుందని ఈ ఎన్నికల తరువాత మోడీ నాయకత్వంలోను,రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వం లోను డబల్ ఇంజన్ సర్కార్ నడుస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి జగన్ గద్దె ఎక్కిన తరువాత సంక్షేమ పాలన పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని, అభివృద్ధి ఆనవాళ్లే లేవు అంటూ లంక ఎద్దేవా వేశారు.

23న నామినేషన్: నరసాపురం లోక్‌సభకు బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మను నిలిపామని ఆయన చెప్పారు. రాక్షస పాలనను ఓడిస్తూ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన వారితో కలిపి సమిష్టిగా విజయం సాధించడం ఖాయమని ఆయన అన్నారు. రాష్ట్రంలో సుస్థిర సుపరిపాలనకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. ఈ నెల 23వ తేదీన శ్రీనివాస్ వర్మ నామినేషన్ దాఖలు చేయబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని దినకర్ కోరారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ విభాగం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు నారిన తాతాజీ, కూరెళ్ళ నరసింహారావు, నరిసే సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కైకలూరు : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 22 న సోమవారం ఉదయం 9.00 గంటల నుంచి కైకలూరు వైఎస్సార్సీపీ శాసనసభ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పాల్గొని కైకలూరు ఏలూరు రోడ్ లోని పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి వెళతామని కావున నియోజకవర్గ రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, నామినేటెడ్ పదవులలో ఉన్న నాయుకులు,దేవాలయాల కమిటీచైర్మన్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయ శంఖారావం మోగించటానికి నాంది పలకాలని కోరారు.

ఒక్కసారి అవకాశం ఇస్తే సేవ చేసి చూపిస్తా

విశాలాంధ్ర - కైకలూరు : ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని లేదంటే రాజకీయాల నుండి తప్పుకుంటానని ఇదే చివరిసారి పోటీ చేయడమని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లావేటి వీర శివాజీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కైకలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా లావేటి వీర శివాజీ నామినేషన్ దాఖలు చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే భాస్కర్ కి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం మీడియా పాయింట్ లో శివాజి మాట్లాడుతూ ఈ దేశాన్ని ప్రేమించాలి,రక్షించాలి,మార్చాలి అనే నేతాజీ ఆశయాలతో ముందుకు వచ్చానని పేర్కొన్నారు.

ఆరోగ్య అవగాహన సదస్సు

విశాలాంధ్ర- నరసాపురం: ఎండాకాలంలో ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు గురించి న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి అవగాహన కల్పించుటకు నరసాపురం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రి వారి సహకారంతో శనివారం కోర్టు భవనముల సముదాయంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి డాక్టర్ పి. సోని ఎండాకాలంలో ఆరోగ్య పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరిస్తూ ఎండ సమయంలో ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా ఇంటిపట్టున ఉండాలని సూచించారు. మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవాలని, చలువ చేసే ఆహారాన్ని తినాలన్నారు. ఎండలో బయటకు రావాల్సి వస్తే కాటన్ దుస్తులు ధరించి, చెవులు, ముక్కుకు ఎండ తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం న్యాయ వాదులకు, కోర్టు సిబ్బందికి బిపి, డయాబెటిస్,హెచ్.బి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పదవ అదనపు జిల్లా జడ్జి, సంస్థ చైర్మన్ పి. విజయ దుర్గ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి కె. శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రంగసాయిని కలిసిన ఉమా బాల

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని ఆయన నివాసంలో నరసాపురం పార్లమెంట్ ఎంపి అభ్యర్థి గూడూరి ఉమాబాల శనివారం కలిశారు. తన తండ్రి సన్నిహితులుచ తమ కుటుంబ శ్రేయోభిలాషిగా నన్ను అనేక సమాజ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు చేసి ప్రోత్సహిస్తున్న రంగసాయి బాబాయి తనకు చిన్నప్పటి నుంచి పరిచయమని ఉమా బాల అన్నారు. నరసాపురం పార్లమెంట్ ఎంపి అభ్యర్థిగా నిలబడుతున్న తనను ఆశీర్వదించాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర-మొగల్తూరు :వేసవిలో ప్రజలు వడగాల్పుల బారిన పడకుండా సిబ్బంది తగిన సూచనలు అందజేయాలని పశ్చిమగోదావరి జిల్లా డి.ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మహేశ్వరరావు ఆదేశించారు. శనివారం మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనితీరు పట్ల వెనుకబడిన గ్రేడులలో ఉన్న కేంద్రాలపై మెరుగైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీ గ్రేడ్ లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బి గ్రేడ్ లో ఉన్న కేంద్రాలు ఏ గ్రేడ్ లోనికి వచ్చేందుకు తగిన శాఖపరమైన మెమోలు అందజేస్తున్నట్లు తెలిపారు. మెమోలతో సిబ్బంది ఫలితాలు మెరుగు పరచకపోతే అటువంటి ఉద్యోగులపై ఇంక్రిమెంట్ కట్ చేయాలని ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని చెప్పారు. జిల్లాలో ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. వడ గాల్పులు తగలకుండా ప్రజలకు సలహాలు సూచనలు అందజేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఉద్యోగులు , వ్యాపారస్తులు, ఉపాధి హామీ పథకం కూలీలు, రైతులు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు మాత్రమే బయట పనులు చూసుకోవాలని , అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయట తిరిగేలా చూసుకోవాలని సూచించారు. మొగల్తూరు ఆసుపత్రి డాక్టర్ ఓ దినేష్ పర్యవేక్షణలో సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

దెందులూరు నియోజకవర్గంలో మూడవరోజు నామినేషన్లు నిల్

విశాలాంధ్ర - దెందులూరు: 64-దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం దెందులూరు నందు మూడో రోజు శనివారం నామినేషన్లు ఎవరూ దాఖలు చేయలేదని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు. నియోజకవర్గంలో శుక్రవారం అబ్బయ్య చౌదరి వై.యస్. ఆర్. కాంగ్రెస్ పార్టీ తరుపున రెండు సెట్లు నామినేషను దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి బి. లావణ్యవేణి తెలిపారు. గురువారం ఆలపాటి నరసింహమూర్తి పెదవేగి మండలం ముందూరు గ్రామానికి చెందిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరుపున దాఖలు చేసినట్టు తెలిపారు.

నక్కావారిపాలెంలో వైసీపీ ప్రచారం

విశాలాంధ్ర-మొగల్తూరు : జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తు పై వేయాలని నరసాపురం వైఎస్ఆర్సీపీ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణం రాజు కోరారు. శనివారం మొగల్తూరు నక్కావారిపాలెం గ్రామంలో ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు.ఆయన వెంట మాజీ ఎ.ఎమ్.సి చైర్మన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లా బత్తుల రవికుమార్ , వైసీపీ మండల అధ్యక్షుడు కర్రీ ఏసుబాబు,గ్రామ సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ,వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఉప సర్పంచ్ బోనం నర్సింహారావు,వార్డు సభ్యుడు కొండా ఆదాము,సచివాలయం కన్వీనర్ కోణాల ప్రసాదరావు,రేవు రాంబాబు, కర్రీ సూర్యనారాయణ, బర్రి వెంకన్నమండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోడెల్లి వెంకట్రావు, మండల యూత్ అధ్యక్షుడు ఏగి బాబీ, నరసాపురం మండల యూత్ అధ్యక్షుడు చినిమిల్లీ చందు,వాక్ బోర్డ్ డైరెక్టర్ షేక్ అమీర్ భాష, కముజు రాంబాబు,కొత్తపల్లి బాబీ,కుక్కల మణి,బొక్క నాగరాజు, తదితరులు ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఎండ తీవ్రత రోజు రోజుకు ఎక్కువగా ఉండటం వలన ప్రతి ఒక్కరూ శీతల పానీయాలను స్వీకరించాలని కొయ్యలగూడెం మానవతా శాఖ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక వినాయకుని ఆలయం వద్ద మానవతా శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రతి ఒక్కరూ ఎండలో ఎక్కువగా తిరగకుండా తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, వివిఎస్ఎన్ స్వామి, నక్క బాబి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే శివపురం రామాలయ ప్రతిష్టామహోత్సవం

విశాలాంధ్ర- చాట్రాయి : శివపురంలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ట మహోత్సవ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.చింతలపూడి మండలం శివపురం గ్రామంలో సుమారు 90ఏళ్ళ క్రితం కీర్తిశేషులు మేడా నర్సయ్య, రత్తయ్య లు సొంతగా నిర్మించి సాంప్రదాయ బద్దంగా మేడా వారి కుటుంబం నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.పాత ఆలయాన్ని తీసివేసి అదే స్థలంలో దేవాదాయశాఖ శాఖతో కలిసి ఆలయ ధర్మకర్తలు నూతన ఆలయం నిర్మించారు.ఈరోజు నుంచి 3రోజుల పాటు సాంప్రదాయ పూజలు నిర్వహించి బుధవారం ఆలయం ప్రారంభోత్సవం చేస్తారు. ఆంధ్ర తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఆలయప్రారంభోత్సవాని చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

బాలల సంరక్షణా చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారయత్నాలు, సైబర్ సంబంధిత నేరాలపై బాలల ఆశ్రమాల సిబ్బందితో పాటు పౌరులందరు అవగాహన కలిగివుండాలని విజయవాడ - వాసవ్యా మహిళా మండలి ఉపాధ్యక్షు రాలు, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ కౌన్సిలర్ కె.విజయ అన్నారు. మండలంలోని హీల్ బాలల ఆశ్రమంలో " బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం -2012 (పోక్సో చట్టం) పై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికలను అసందర్భంగా స్పృశించడం, సైగలు చేయడం, అశ్లీల పదాలను ప్రయోగించడం, అశ్లీల చిత్రాలను చూపించడం, వేధించడం, మానసిక లేదా శారీరక హింసకు గురిచేయడం, బాల్యవివాహాలు మొదలైన నేరాలన్నింటికీ పోక్సో చట్టం ప్రకారం కఠినమైన శిక్షలుంటాయని వివరించారు. సైబర్ సంబంధిత నేరాలపట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ బి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -భీమవరం: టిడిపి ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి జనసేన బిజెపి నాయకులు ముందుగా కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థిదశ నుండే నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న చంద్రబాబు చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, సంపద సృష్టించడంలో చంద్రబాబుకి తప్ప ఎవరికీ సాధ్యపడదని రానున్న ఎన్నికలలో చంద్రబాబుని ముఖ్యమంత్రి చేసేలా ఎన్డీఏ పార్టీల నాయకులు విశేష కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల చంద్రశేఖర్, అంగనవాడి డ్వాక్రా సంఘాల ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, భీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో : తెదేపా జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిగూడెం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల మల్లిఖార్జునరావు(బాబ్జి) ఆధ్వర్యంలో కేక్ కటింగ్, పట్టణ మాజీ కౌన్సిలర్ చుక్కా కన్నామనాయుడు 15 వ వార్డ్ లోని ఆయన ఇంటి వద్ద కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు..ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి పార్టీ ల అసెంబ్లీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ ముందుగా చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు,కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, వర్తనపల్లి కాశి,పుల్లా బాబి,రామిశెట్టి సురేష్,తాడేపల్లిగూడెం నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో: టీడీపీ జాతీయ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 74 వ పుట్టిన రోజు వేడుకలు స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ,మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో పుట్టిన రోజు కేక్ ను టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావూరి కృష్ణ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మరి కొద్దిరోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రాష్ట్రానికి ఉత్తమ పరిపాలన అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, టిడిపి సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు,పెనుమర్తి రామ్ కుమార్, బొబ్బర రాజ్ పాల్ కుమార్,పరిమి సత్తిపండు,మహంకాళి రామమోహనరావు, తూటిగుంట రాము,చెరుకూరి శ్రీధర్,రాజాన పండు, బిజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టి నరసాపురం: మండలంలోని తిరుమల దేవిపేట గ్రామంలో రాష్ట్ర తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ప్రగతి పదంలో నడిపించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే శ్రీను, తోట వీరాస్వామి నాయుడు, కాసగాని వీరాజు, మన్యం దుర్గారావు, అబ్బదాసరి పండు, టిఎన్ఎస్ ఎఫ్ నాయకులు మధ్యాహ్నపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం మండలంలోని మట్టగుంట గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 20 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా రాష్ట్రప్రజల కోసం నిరంరత అభివృద్ధి కొరకు పాటుపడ్డాడని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతు ఇచ్చి వెనుకబడిన ఆంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కోకా. తాతయ్య తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు కోపనాతి. వెంకటేశ్వరరావు బూత్ కన్వీనర్ తిరుమల శెట్టి. ఈశ్వర పరశురాముడు కోపనాతి. విష్ణు వాతాడి. రాంబాబు తిరుమల శెట్టి. రమేష్ మోకా. హరికృష్ణ కోపనాతి. దుర్గాప్రసాద్ నాగిడి. వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజయరాజు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు చింతలపూడిలో శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణం నుండి వైసీపీ నాయకులు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,బివిఆర్ చౌదరి,మేడవరపు విద్యాసాగర్, మండవల్లి విజయ సారధి, , పట్టణ వైసిపి అధ్యక్షుడు చిటికల అచ్యుత రామయ్య, పి.పి.ఎన్ చంద్రరావు, తదితరుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు చింతలపూడి తరలి వెళ్లారు. జంగారెడ్డిగూడెం మండలం నుండి జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, మండల వైసీపీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు,ఎంపీపీ కొదమ జ్యోతి తదితరులు కార్యక్రమానికి తరలి వెళ్లారు.

బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ బండి ముత్యాలమ్మ హుండీ లెక్కింపు భీమవరం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించారు. 64 రోజులకు గాను రూ.14,63,735 ఆదాయం లభించినట్లు కార్యనిర్వాహణాధికారి దెందుకూరు రామకృష్ణంరాజు తెలిపారు. లెక్కింపులో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కదలి మాణిక్యాలరావు పాలకవర్గ సభ్యులు మాజీ చైర్మన్లు, గ్రామ పెద్దలు సేవా సమితి సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి... లక్కీ డీప్ పొందండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి.. లక్కీ డీప్ పొందండి అని ప్రజా రవాణా సంస్థ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఏడిఎల్ సుధారాణి అన్నారు.స్థానిక బస్ స్టేషన్ లో ప్రయాణీకుల సమక్షంలో, లక్కీ డీప్ నిర్వహిం చారు. ఈ లక్కీ డీప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సుధారాణి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రయాణికులు, యూనియన్ నాయకులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు., లక్కీ డీప్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులను ఉద్దేశించి అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ ఏ.పీ.ఎస్.ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేయండి లక్కీ గిఫ్ట్ పొందండి, అని వివరించారు. లక్కీ డీప్ విజేతలకు తాడేపల్లిగూడెం జీవీ మాల్ షాప్ అండ్ సెలబ్రేట్ వారు ఆర్థిక సౌజన్యంతో బహుమతులను అందజేసారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

కమిషనర్ జే వెంకటరావు వెల్లడి

విశాలాంధ్ర - కాకినాడ : వేసవిలో ప్రజలదాహార్తిని తీర్చేందుకు ఆదివారం నుంచి కాకినాడ నగరంలో చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె వెంకటరావు తెలిపారు. ఈ అంశంపై ఆయన సంబంధిత ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులకు శనివారం సూచనలు ఇచ్చారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న విధంగానే ప్రస్తుత వేసవిలో జనసామర్థ్యం అధికంగా ఉన్న 16చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇందులో భగంగా ఆదివారం నుంచి ముందుగా ఏడు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భానుగుడి, ఆర్టీసీ కాంప్లెక్స్, జీజీహెచ్, అన్నమఘా టీసెంటర్, కోటిపల్లి బస్టాండ్, బాలాజీచెరువు, ఎంఎస్ఎన్‌చార్టీస్ ప్రాంతాల్లో చల్లని మంచినీటిని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చనున్నట్టు చెప్పారు. అనంతరం మరికొద్ది రోజుల్లోనే ఇతర ముఖ్యకూడళ్ళులో మిగిలిన చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నితిన్‌కు దుస్తులు, ఆర్థికసాయం అందజేత

విశాలాంధ్ర - దేవరపల్లి: సామాజిక కార్యక్రమాలపై యువతకు అవగాహన కల్పించి రాష్ట్రంలో సామాజిక పరిస్థితులు తెలుసుకోవటానికి నెల్లూరు జిల్లా కావలికి చెందిన చింతలపూడి నితిన్ ఫిబ్రవరి 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర శనివారం ఉదయం దేవరపల్లికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ ఇప్పటికీ 2500 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానని తెలిపారు. దేవరపల్లి రాజమండ్రి అన్నవరం విశాఖపట్నం మీదుగా శ్రీకాకుళం ఇచ్ఛాపురం సైకిల్ యాత్ర చేస్తానని మార్గ మధ్యంలో ఎన్జీవోస్ని స్వచ్ఛంద సంస్థ సభ్యులను ఆధ్యాత్మికవేత్తలను కలుసుకుంటానని తెలిపారు. చింతలపూడి నితిన్‌కు రాష్ట్ర మానవతా సంస్థ కన్వీనర్ బలుసు సత్యనారాయణ దేవరపల్లిలో స్వాగతం పలికి దుస్తులను బహుకరించారు. ఈ సందర్భంగా దేవరపల్లిలో గల జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరంలో విగ్నేశ్వరుడు ఆది శంకరాచార్యులు మహాలక్ష్మి సరస్వతి లను సందర్శించుకున్నారు. ఆదిశంకరాచార్య ధ్యాన మందిర్ కమిటీ సభ్యుడు తోట సత్యనారాయణ సౌందర్య హరి పుస్తకం సాలువ అందజేశారు. దేవరపల్లి కి చెందిన చల్లా సూర్యచంద్రం నల్ల మాటి సుబ్బారావు తదితరులు నికితను కలిశారు. అనంతరం మానవత స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలి సత్యనారాయణ నితిన్‌కు దుస్తులతో పాటు ఆర్థిక సహాయం అందించారు

జగన్‌కు అధికారం ఇస్తే బతుకులు చిద్రమే

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఐదేళ్ల జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా చాలా అసంతృప్తిగా ఉన్నా రని, మరో మారు అతనికి అధికారం ఇస్తే మన బతుకులు చిద్రం అవుతాయని రాజకీయ పరిశీకులు గంధం కృష్ణ (జీకె) అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ కేవలం అధికార వ్యామోహంతోనే రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్రాన్ని లూటీ చేశారని మండి పడ్డారు. సంక్షేమం అంటూ మనందరినీ సంక్షోభంలోకి నెట్టేశారని విమర్శించారు. అసహనం, అసంతృప్తితో ఉన్న ప్రజలు మళ్లీ అవకాశం ఇవ్వరని గ్రహించిన జగన్ బస్సు యాత్రలు చేసి ఓట్లు అడ్డుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. ఐదేళ్ల పాలనలో 20 ఏళ్ల రాష్ట్రాభివృద్ధి వెనక్కి లాగేశారని దుయ్యబట్టారు. సంక్షేమం అంటూ ప్రజల చేతికి 10 రూపాయలు ఇచ్చి దొడ్డి దారిన 100 రూపాయలు బలవంతంగా లాగేసుకున్నారని విమర్శించారు. పని తీరు సక్రమంగా లేదని, ప్రజలు తిరగబడుతున్నారని తెలిసి అధికారం కోసం ఎమ్మెల్యేల నియోజకవర్గాల మార్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి దానిపై వచ్చిన ఆదాయంతోనే పాలన సాగించిన ఘనుడు జగన్ అని ధ్వజమెత్తారు. ఓటర్లు ఆలోచించి ఈసారి ఎన్నికల్లో సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే సమర్ధులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. మీడియా సమావేశంలో పుప్పాల వినయ్, టిక్కా సతీష్, తలారి శ్రీను, దేశినీడి రాంబాబు, వెలుగూరి ప్రసాద్, ఆశ, బాబీ, టి నారాయణస్వామి, ఆకుల సూరిబాబు, వెలిరెడ్డి శ్రీను, చవాకుల శ్రీను, మానే ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు దేవరపల్లిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు . దేవరపల్లి మండల తెలుగుదేశం జనసేన బిజెపి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు గన్నమని హరికృష్ణ గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి సువర్ణ రాజు దేశం నేతలు యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రామారావు, కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, ముళ్ళపూడి సత్యనారాయణ, ఎలమాటి అక్కిరాజు, జనసేన నేతలు అని శెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు అడ బాల మణికంఠ, జాజిమొగ్గల శ్రీనివాస్, దేశం బిజెపి జనసేన నేతలు కేక్ కట్ చేసి చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

చంద్రబాబు నాయుడు కారణజన్ముడు : ముప్పిడి

విశాలాంధ్ర - కొవ్వూరు : మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షులు నారా చంద్రబాబు నాయుడు కారణజన్ముడని కొవ్వూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వర అన్నారు. కొవ్వూ రు మండలం ఆరకి రేవుల గ్రామంలో శని వారం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ముప్పిడి మాట్లాడుతూ అభివృద్ధి అంటే చంద్రబాబు అని సంక్షేమం అంటే చంద్రబాబు అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షులు దేగల రాము, గంగ మల్లస్వామి, కన్నాబి రామాంజనేయులు, టీడీపీ నాయకులు కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని బిచ్చగాడు మృతి

విశాలాంధ్ర - గండేపల్లి : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బిచ్చగాడు మృతి చెందాడు. 19వ తేదీ శుక్రవారం రాత్రి 9:50 గంటల సమయంలో సుమారు 50 నుండి 55 సంవత్సరముల వయస్సు కలిగిన ఒక బిచ్చగాడు మురారి నుంచి గండేపల్లి వైపు వస్తూ ఉండగా వెనుక నుంచి ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బిచ్చగాడికి తలకు బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయంపై మురారి వీఆర్వో పేరూరి సుబ్బారావు ఇచ్చిన రిపోర్టుపై గండేపల్లి ఎస్సై ఎన్ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర - జగ్గంపేట : సార్వత్రిక ఎన్నికల జగ్గంపేట అసెంబ్లీకి శనివారం రెండు నామినేషన్లు దాఖలు అయ్యినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా బలిరెడ్డి సాల్మన్ రాజు, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సాదే సరేంద్ర బాబు నామినేషన్ దాఖలు చేశారన్నారు. నరేంద్ర బాబు సమర్పించిన అఫిడవిట్‌లో ఎటువంటి స్థిరాస్తులు లేవని సాల్మన్ రాజు అఫిడవిట్ దాఖలు చేయలేదని మీడియాకు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే దేశాభివృద్ధి

రేపు నామినేషన్ దాఖలు చేయనున్న గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఈ దేశంలో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ చేసిందేనని రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. పండిట్ నెహ్రూ దగ్గర నుంచి మన్మోహన్ సింగ్ వరకు ప్రణాళికా బద్ధంగా ఈ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకుందని ఆయన అన్నారు. స్థానిక సోమాలమ్మ పుంత రోడ్డులోని రాజమండ్రి పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయిందని, జీఎస్టీ ఐదుదశల్లో విధించి కష్టాలు మిగిల్చారని రుద్రరాజు విమర్శించారు. ఎలక్ట్రోల్ బాండ్ల పేరిట ఆరువేల కోట్ల రూపాయలను బిజెపి దోచుకుందని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని అయన అన్నారు. రాష్ట్రంలో బిజెపితో టిడిపి, జనసేన పొత్తులో చేరిపోతే, జగన్ తొత్తుగా మారారని ఫలితంగా జగన్ , చంద్రబాబు వేసుకున్న మాస్కులు తొలగిపోయాయని రుద్రరాజు పేర్కొన్నారు. సమగ్ర అభివృద్ధికి కట్టుబడిన కాంగ్రెస్ ని గెలిపించాలని అయన కోరారు. త్యాగధనుడు టంగుటూరి ప్రకాశం పంతులుతో పురందేశ్వరి పోల్చుకోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్‌లో కేంద్రమంత్రిగా వ్యవహరించి, ఆతర్వాత కాంగ్రెస్ వీక్ అయిందని తెలిసి బీజేపీలో చేరారని, గతంలో బాపట్ల, విశాఖ, రాజంపేటలలో పోటీచేసి ఇప్పుడు రాజమండ్రిలో పోటీకి దిగారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 22 సోమవారం ఉదయం బొమ్మూరు కలక్టరేట్ లో నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు రుద్రరాజు చెప్పారు. ఎన్. రఘువీరారెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారని ఆయన చెప్పారు. అలాగే రాజమండ్రి సిటీ, రూరల్ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేస్తారని ఆయన తెలిపారు. 23న రాజానగరం అభ్యర్థి నామినేషన్ వేస్తారని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు వల్లే సాధ్యం

విశాలాంధ్ర - సీతానగరం: ఘనంగా టీడీపీ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు. మండలంలో గల ముగ్గుళ్ళ గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు గెడ్డ%శీ% తిమ్మరావు ఆధ్వర్యంలో రాజానగరం టీడీపీ ఇంచార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా నారా చంద్రబాబు నాయుడు 74వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కేక్ కటింగ్ చేసి తమ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగాలి అంటే 40 సవంత్సారాల రాజకీయ అనుభవం గల చంద్రబాబు వల్లే సాధ్యం అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే చంద్రబాబు నాయుడు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తిన సతీష్, పోలిన కృష్ణ, అవిశ్వామి, కాండ్రు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి సభకు తరలిన జన సైనికులు

విశాలాంధ్ర - రాజానగరం : కోరుకొండ నడిబొడ్డులో జరగనున్న పవన్ కళ్యాణ్ వారాహి సభకు రాజానగరం నుండి జన సైనికులు,తెలుగు తమ్ములు కలిసి తరలివెళ్లారు.ఎన్డీఏ కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అధ్యక్షతన,బీజేపీ పార్లమెంటు అభ్యర్థి నేతృత్వంలో నియోజకవర్గంలోని కోరుకొండ గ్రామంలో శనివారం సాయింత్రం జరగనున్న వారాహి సభకు మండల కేంద్రమైన రాజానగరం నుండి జనసేన,టీడీపీ పార్టీల నాయకులు కుర్రీ నాగబాబు నేతృత్వంలో కుర్రి శ్రీను పార్టీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పిడుగు సురేష్,లోడగల శ్రీను,సమ్మంగి శ్రీను, గుంతెన సూరిబాబు,పినిశెట్టి అబ్బు,పినిశెట్టి దుర్గారావు, గైట్ ప్రసాద్, రాయుడు చిన్న, గండి జయ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

విశాలాంధ్ర - కరప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమితోనే సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి తెలిపారు. కరప మండలం జి భావారం గ్రామంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి పంతం నానాజీ కుమారుడు పంతం సందీప్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కో కోఆర్డినేటర్ కటకం శెట్టి బాబీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచుతూ కూటమి ప్రభుత్వానికి ఓటు వేయాలని ప్రజలకు తెలియజేశారు. బీసీలంతా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని పిల్లి సత్తిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి జయేంద్ర బాబు, రాజేష్, పేపకాయల సత్తిబాబు, బండారు మురళీకృష్ణ, కొండబాబు, గంగాధర్, వీర వెంకట సత్యనారాయణ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రథమ సప్తాహ మహోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి పాతూరులో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో శ్రీ గౌరీ శంకర బాల భక్త భజన సమాజం ఆధ్వర్యంలో ఏడు రోజుల నుంచి ప్రారంభించిన ఈ కార్యక్రమం శనివారంతో ముగిసింది.

ఉమామహేశ్వరరావు సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా కాకినాడ గాంధీనగర్ అశ్వని హాస్పిటల్‌లో ఇటీవల శివైక్యం పొందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉమామహేశ్వరరావు సంస్మరణ సభ శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు లేని లోటు కాకినాడ జిల్లా , పరిసర ప్రాంత ప్రజలకు తీరని లోటు అని వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన శస్త్ర చికిత్స చేసి ఎంతోమందికి ప్రాణాలు పోయడమే కాక ప్రత్యక్షంగాను పరోక్షంగానూ ఎంతో మందికి సహాయ సహకారాలు అందించారని అన్నారు. కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్ మాజీ సూపెరంటిండెంట్ డా బుద్దా మాట్లాడుతూ కాకినాడ జిల్లా వైద్య రంగంలో ఎంతో అనుభవజ్ఞుడైన వ్యక్తిని కోల్పోవడం వైద్యులందరికీ అలాగే ప్రజలకు తీరని లోటు అని అన్నారు. డాక్టర్ విక్రమ్ మాట్లా డుతూ తనకు అత్యంత సన్నిహితుల్లో డా ఉమామహేశ్వరరావు ఒకరు అని ఆయనతోపాటు ఎన్నో శస్త్ర చికిత్సలు చేయడం జరిగిందని ఎంతటి కష్టమైనా సర్జరీ అయినా సరే ఆయనకు ఉన్న అనుభవంతో ఎంతో సునాయాసంగా చేసే వారని వైద్య పరంగానే కాకుండా ఎదుటి వారి మంచిని కోరుకోవడంలో వారు ఎప్పుడూ ముందుండేవారని అటువంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం మనందరి దురదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి పూర్ణ సురేష్, నాగమణి, శ్యామల, రేణుక, వసుం ఉపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భర్త గెలుపు కోసం భార్య ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - కాకినాడ, పెద్దాపురం : మీలో ఒక్కడూ, నిత్యం మీతో ఉండే మీ అందరి వాడు, నిజాయతీపరుడు నా భర్తను రానున్న సార్వ త్రిక ఎన్నికల్లో మీ అమూ ల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీ మణి చంద్రకళ కోరారు. పెద్దాపురం పట్టణంలో 23వ వార్డులో ఆమె అయ్యారక కార్పోరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు. వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి ఆ వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ, సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మీలో ఒక్కడిగా, స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన నా భర్తకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారని, ప్రతీ ఒక్కరూ ఆయనను ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని చంద్రకళ కోరారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోదఫా వైఎస్సార్ సీపీ పార్టీకి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. స్థానికుడైన దొరబాబును ఎమ్మెల్యే గాను కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటి చేస్తున్న చలమలశెట్టి సునీల్‌ను ఎంపీ గాను ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దొంగ ఓట్ల డ్రామా...

బత్తుల వ్యవహారంపై మండిపడ్డ వైసీపీనేతలు

విశాలాంధ్ర - రాజానగరం : ఎన్నికల ముందే ఓటమి భయంతో దొంగ ఓట్లుకు ఎన్డిఏ కూటమి అభ్యర్థి బత్తుల బలరామ కృష్ణా డ్రామాకు తేరాలేపరని వైసిపి మండల కన్వీనర్ దూలం పెద్ద అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలోని వైసిపి కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ విధానం దొంగే దొంగ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు.బత్తుల దొంగ బుద్ధి బయటపడే రోజు త్వరలోనే ఉందన్నారు. నామినేషన్లు రెండు రోజుల ముందు ఓటమి భయంతో దొంగ ఓట్లు డ్రామాకు తెరలేపారని ఆరో పించారు. ప్రచారం కోసం ఇటువంటి చవకబారు రాజకీయ మాను కోవాలని హితవు పలికారు. తప్పుడు ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణా మాలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద్ద మాట్లాడుతూ దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. దివాన్ చెరువు సొసైటీ అధ్యక్షుడు గంగిశెట్టి సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బత్తుల దొంగ ఓట్లు నమోదు చేశారని వీటి వివరాలు త్వరలోనే బయట పెడతామన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ సమాఖ్య సంఘం అధ్యక్షులు కోలపాటి వెంకన్న, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు, మాజీ సర్పంచ్ లు ఉండమట్ల రాజబాబు, గుండి నానిబాబు, నందరాడ సొసైటీ అధ్యక్షుడు పబ్బన శ్రీనివాస్, వేమగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - రాజానగరం : 2024-25 విద్యా వార్షికోత్సవ సంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లొమా ఇన్ యోగా వన్ ఇయర్ పార్ట్ టైమ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. దీనిలో భాగంగా వర్సిటీ ఆధ్వర్యంలో శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా కానవరం వారిచే పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో భాగంగా ప్రవేశాలకు దరఖాస్తులు చేస్తున్నామన్నారు. వర్సిటీ ప్రాంగణంతో పాటు శ్రీ రాపర్తిరామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా కానవరంలో 50 సీట్లు చొప్పున కోర్సును అందిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో చేరేందుకు అర్హులన్నారు.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు మే 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు రూ:6 వేలు, బయట వారికి రూ:10 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, యోగా సంస్థ ప్రతినిధులు జివిఎస్ రామరాజు, ఎంబిజిఎస్ శర్మ, ఎన్ శివశంకరరావు మరియు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

మూడోరోజు ఆరు నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర - కాకినాడ : సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి కాకినాడ జిల్లాలో శనివారం మూడో రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఏడు శాసనసభ నియోజక వర్గాల్లో ఐదు నామినేషన్లు, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్ దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుని నియోజకవర్గం నుంచి సీపీఐ-ఎంఎల్ లిబరేషన్ వడబోయిన శివబీ కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి సూర్యనారాయణ మూర్తి చాగంటి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, జనసేన పార్టీ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) రెండు సెట్లుబీ జగ్గంపేట నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి బాలిరెడ్డి సాల్మన్ రాజు ఒక సెట్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాదే నరేంద్ర బాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పెయ్యల దుర్గాప్రసాద్ ఒక సెట్ నామినేషన్లను దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు.

క్షేత్రస్థాయి వైద్యారోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి

జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి వీరబాబు వెల్లడి

విశాలాంధ్ర - ఆలమూరు : గ్రామీణ స్థాయి నుంచి నగర పాలక సంస్థల వరకూ క్షేత్రస్థాయిలో వైద్యా రోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి ఖచ్చిత త్వమైన సమాచారాన్ని సేకరించి మరింత మెరుగ్గా నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) విభాగాన్ని నెలకొల్పిందని జిల్లా ప్రత్యేక అధికారి కె వీరబాబు అన్నారు. ఆలమూరు మం డలంలోని పెదపళ్ల ఆయుష్మాన్ భారత మందిర్‌లో స్థానిక వైద్యాధికారులు పి భవానీ శంకర్, డి సాయికిషోర్ సమక్షంలో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 56 ఆరోగ్య కేంద్రాలు ఉండగా అందులో 49 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) ఉన్నాయన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్ల లోపు వరకూ క్షేత్రస్థాయిలో వైద్యారోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ ఎస్ వెంకటేశ్వరరావు ఈప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసారన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లోపాలను సత్వరమే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. గర్భిణుల్లోను రక్తహీనతను నివారించేందుకు, చిన్నారులకు నిర్ణీత సమయంలో వైద్యారోగ్యశాఖ సరఫరా చేస్తున్న 13 రకాల టీకాలు వేసేందుకు అవసరమైన సేవలను అందిస్తున్నారా లేదా అనే అంశాలపై తాము ప్రత్యేక దృష్టి సాదిస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యకు తీసుకోవలసిన చర్యలపై ఆరోగ్య, ఆశ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ఏమాత్రం ఏమరపాటు ప్రదర్శించినా, సేవలను అందించడంలో నిర్లక్ష్యం వహించినా సత్వరమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు డీటీఎఫ్ ప్రత్యేక అధికారి వీరబాబు పేర్కొన్నారు. డీపీహెచ్ఎన్ఓ పిబిఎల్,కుమారి, డేటా మేనేజర్ ఎస్‌టీ పి కృష్ణమూర్తి, హెచ్‌వి పి ఉమ, డీపీఓ ఎస్ రవి, ఏఎస్ఏ ఎం పాదాలు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది చైత్ర మాసం ఏకాదశి పర్వదిన సందర్భంగా స్వామివారికి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివార్లకు అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. గేలం వెంకటేశ్వరరావ ఉమా దేవి గుడ్ల వెంకటేశ్వరరావు కనకదుర్గ కొండపల్లి సత్యనారాయ శ్రీలక్ష్మి దంపతులు పేర్ల మీద కూర్చుని కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి కల్యాణోత్సవం విశేషాలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు స్థానిక భక్తులు అంబటి సత్యనారాయణ రావు రామకుర్తి వెంకటరత్నం జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం సౌందర్య లహరి కమిటీ సభ్యులు కరటూరి సత్యవాణి ఉప్పలపాటి పద్మావతి, చావా సునీత, ఉప్పలపాటి ప్రసన్న ,చిరపూరి బేబీ, నారాయణ , లక్ష్మీ రాణి , సుధాపల్లి , సూర్య భాను, పాల్గొన్నారు

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : శ్రీదేవి భూదేవి సమేత వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏడు శని వారాల వెంకన్న దర్శనం ఏడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో ఈ ఆలయం అలరారుతుంది. విద్యుత్ దీపాల అలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కళ్యాణవేదికవద్ద పండితులు ఖండవల్లి రాజేశ్వర ప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో కళ్యాణ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామివారిని అమ్మవార్లను సుగంధద్రవ్యాలతో అలంకరించి పల్లకిలో వేదమంత్రాలు వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో స్వామివారిని కళ్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి రజిత సింహాసనంపై ఆశీనులను చేశారు. స్వామివారికి అర్చక బృందం విశ్వక్సేన పూజ, పుణ్యా వచనం, కంకణ ధారణ, బ్రహ్మముడులు, కన్యాదానం, పాద ప్రక్షాళన, సూత్ర యజ్ఞోప వేదధారణ, తలంబ్రాల కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపించారు. స్వామి అమ్మవార్లకు డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిం చారు. కళ్యాణ వేదిక సమీపంలో భక్తులు వెలిగించిన దీపాలు ఆకట్టుకున్నాయి. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా వెంకన్న రథోత్సవం : కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి దధోత్సవ కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ పురవీధుల్లో రెండు గంటలు పాటు రథాన్ని వేలాదిమంది భక్తులతో కన్నుల పండువగా మడవీధుల్లో విహరింపజేశారు. తొలుతగా అమ్మవారిని శ్రీవారిని ఊరేగింపుగా తోడ్కొని వచ్చి ఎదుర్కోలు మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. లక్షలాది మంది భక్తులతో గ్రామ పురవీధులు భక్త జనంతో పులకించాయి. ఈ రథోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు : కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కల్యాణోత్సవం రథోత్సవం కార్యక్రమంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. దానికితగ్గట్టుగా డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సీఐ రామ్ కుమార్, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతరుల పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టమైన చర్యలు తీసుకున్నారు.

కేశవ స్వామి ఆలయంలో అన్నమయ్య స్వరార్చన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం ఈ ఆలయమునకు ఒక విశిష్ట కలిగి ఉంది ముందు పురుషుని రూపం వెనక స్త్రీ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. శనివారం రోజున ర్యాలీ శ్రీ జగన్మోహినీ కేశవ గోపాల స్వామి వారి దేవస్థానం నందు కళ్యాణ మహోత్సవముల సందర్భంగా కరుటూరి వెంకట శ్రీనివాసరావు, బృందం, అంకంపాలెం అన్నమయ్య స్వరార్చన కార్యక్రమము నిర్వహించడమైనది. కళాకారులను శ్రీ స్వామి వారి ఫొటో, ప్రశంసా పత్రము, శేషవస్త్రంతో సత్కరించడమైనది ఆలయ ఈవో కృష్ణ చైతన్య తెలిపారు.